తెలుగు దినపత్రిక
# కబురు
KABURU TELUGU DAILY
RNI APTEL/1999/00110

**రంభ రీ ఎంట్రీ.. క్లారిటీ ఇచ్చిన నిర్మాత**

మిగతాది 8లో

**ఇదండీ..కబురు..**




బాధ పడొద్దంటూ హై కమాండ్ మీ 'ఫ్రెండ్'కి విజయ శాంతి నటించిన సిన్మా టికెట్ పంపించింది సార్!


సంపుటి : 23 సంచిక : 88 | బుధవారం మార్చి 12 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల -5

## మార్చి 12న.. 1,532 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి11:
జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మార్చి 12న (బుధవారం) నియామక పత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1,292 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు 240 మందిని ఇటీవల టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. కొత్తగా నియమితులైన లెక్చరర్లకు విద్యా శాఖ విధానాలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చి కాలేజీల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. కొత్త లెక్చరర్ల నియామకాలతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు.

## పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా
## ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్,మార్చి11 :
నిజామాబాద్ పసుపు రైతుల ఆందోళనలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. పసుపు రైతుల ఆందోళనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే రేవంత్ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. మాటలు చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ఎందుకు ముందుకు రావడం లేదని కవిత ప్రశ్నించారు. క్వింటా పసుపు పంటకు రూ.15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు పసుపు పంటకు కనీసం రూ. 9 వేలు రాని పరిస్థితి ఉందన్నారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.

2లో..




## SLBC టన్నెల్ లోకి రోబో
## - 110 మందితో రెస్క్యూ టీం..

- ఎస్ఎల్బీసీలో గల్లంతైన ఏడుగురి కోసం సెర్చ్
- నాన్ స్టాప్ గా వస్తున్న నీటి ఊట, పేరుకు పోతున్న బురద
- టీబీఎం మిషన్ కట్ చేసి శిథిలాలను తొలగిస్తూ ముందుకు
- 13.200 కి. మీ వరకు లోకో ట్రైన్ ద్వారా.. తర్వాత కాలినడకన

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి11:
సొరంగంలో గల్లంతైన ఏడుగురి కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఇవాళ రోబోను రంగంలోకి దించారు. మొత్తం 8 మందిలో గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. కేరళకు చెందిన కేడావర్ డాగ్స్, జీపీఆర్ సిస్టం ద్వారా గుర్తించిన ప్రదేశాల్లో సింగరేణి కార్మికులు, ర్యాట్ హోల్ మైనర్ల తవ్వకాలు జరిపినా ఫలితం లేక పోయింది. దీనికి తోడు పై నుంచి నిరంతరంగా నీటి ఊట వస్తుండటం, బురద పేరుకుపోతుండటంతో రెస్క్యూ ఆపరేషన్ లోకి రోబోను రంగంలోకి దించారు అధికారులు. చివరి పాయింట్ వద్ద గల్లంతైన వారి మృతదేహాలు లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన అన్వి రోబో తో నిపుణులు రెస్క్యూ ఆపరేషన్ లో భాగంగా లోపలికి వెళ్లారు. 13.200 కిలోమీటర్ల వరకు లోకో ట్రైన్ ద్వారా చేరుకుంటారు. అక్కడనుండి 13.850 కిలోమీటర్ల వరకు కాలినడకన శిథిలాలు, మట్టి, బురద, రెండు ఎస్కవేటర్ల మట్టి, శిథిలాల మధ్య జాగ్రత్తలు పాటిస్తూ చేరుకోవాల్సి ఉంటుంది. 17 రోజులపాటు నిరంతరం శ్రమించిన రెస్క్యూ బృందాలకు కార్మికుల జాడ లభించకపోవడంతో రోబో ద్వారా అయినా ఆచూకీ లభిస్తుందనే ఆశతో రంగంలోకి దింపారు. మానవులు చేరుకోలేని ప్రదేశానికి రోబోను పంపి సహాయక చర్యలను మరింత ముందుకు తీసుకువెళ్లే విధంగా ఉన్నతాధికారులు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. లోపల శిథిలాలు, మట్టి, బురద సహాయక చర్యలకు అడ్డంకిగా మారడంతోపాటు నీటి ఊట కొనసాగుతూ ఉండటంతో సహాయక బృందాలు జాగ్రత్తలు పాటిస్తున్నారు.

## ఆగమైపోతున్న.. తెలంగాన రైతన్న

- నీళ్లు లేక..కరెంట్ రాక వ్యవసాయం అధోగతి
- మరోమారు కాంగ్రెస్‌పై మండిపడ్డ కెటిఆర్



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి11:
కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిస్తున్నా పట్టించుకునే నాథులు లేరని అన్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్న తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.

02

## ఎంపీ రఘునందన్ రావుకు హైకోర్టులో ఊరట



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి11:
మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు హైకోర్టులో ఊరట లభించింది. నాగార్జున సాగర్ లో రఘునందన్ రావుపై నమోదైన కేసును హైకోర్టు కొట్టి వేసింది. 2021లో నాగార్జున సాగర్ ఉప ఎన్నిక సందర్భంగా రఘునందన్ రావుపై ఎఫ్ఐఆర్ నమోదైంది. మోడల్ కోడ్ అమల్లో ఉండగా అనుమతి లేకుండా ప్రచారం నిర్వహించారని ఫిర్యాదు చేశారు ఎంపీడీవో దుబ్బ సత్యం. రఘునందన్ రావు ఉట్లపల్లి, పులిచెర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఫిర్యాదు చేశారు ఎంపీడీవో దుబ్బ సత్యం. ఆ కేసును హైకోర్టు కొట్టివేసింది.

## నేను అసెంబ్లీకి వస్తున్నా..
## అంతా సిద్ధం కండి

- అసెంబ్లీలో సమస్యలపై పోరాడుదాం
- ప్రభుత్వ తీరును సహేతుకంగా ఎండగడదాం
- బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో కెసిఆర్ కీలక ఆదేశాలు



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి11:
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి , అసెంబ్లీలో విపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారు. నేనూ వస్తున్నా..మీరంతా రావాలి..సమస్యలపై పోరాడుదాం అని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని సూచించారు. ప్రతిరోజూ అసెంబ్లీకి తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

2 లో

## మారిషస్ పర్యటనలో ప్రధాని మోడీ
### - అత్యున్నత పురస్కారంతో సత్కారం



కబురు న్యూస్న్యూఢిల్లీ, మార్చి11:
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మారిషస్ దేశ అత్యున్నత పురస్కారం దక్కింది. తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్'ను మోదీకి ఆ దేశ ప్రధాని నవీన్ రామ్‌గులాం ప్రకటించారు. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారత ప్రధానిగా మోదీ ఘనత సాధించారు. ప్రస్తుతం మారిషస్ పర్యటనలో ఉన్న మోదీ.. ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, ఆయన సతీమణి వీణా రామ్‌గులాంలకు 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ)' కార్డులు ప్రకటించారు.

## రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

- కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



మిగతాది 2లో

కబురు న్యూస్న్యూఢిల్లీ, మార్చి11:
రీజినల్ రింగ్‌రోడ్డు కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్‌ఆర్‌ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# ట్రంప్ శాంతిమంత్రం



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈసారి ఎవరి అంచనాలకూ అందకూడదన్న సంకల్పంతో ఉన్నట్టు కనబడుతోంది. సరిగ్గా నెల్లాళ్ల క్రితం ఆయన ఇరాన్‌పై ఆంక్షల తీవ్రతను పెంచారు. అంతే కాదు... తనను చంపటానికి ప్రయత్నిస్తే ఇరాన్ తుడిచిపెట్టుకుపోతుందని తీవ్రంగా హెచ్చరించారు. తనకేం జరిగినా వెనువెంటనే ఇరాన్‌పై దాడి చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చానన్నారు. నాలుగు రోజుల క్రితం ఆయన హఠాత్తుగా స్వరం మార్చారు. అణు ఒప్పందంపై చర్చలకు రావా లని ఇరాన్‌కు పిలుపునిచ్చారు. అందుకు సంబంధించి తాజాగా ఒక లేఖ కూడా విడుదల చేశారు. సైనిక చర్య తీసుకుంటే ఇరాన్ భయంకరమైన పరిణామాలు చవిచూసే పరిస్థితి ఏర్పడుతుంది గనుకే చర్చలకు పిలుపునిచ్చానని ట్రంప్ వివరణనిచ్చారు. తొలిసారి అధికారంలోకొచ్చినప్పుడు అంతక్రితం ఒమామా హయాంలో కుదిరిన అణు ఒప్పందాన్ని కాస్తా ట్రంప్ 2018లో ఏకపక్షంగా రద్దుచేశారు. అది కేవలం అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం కాదు. వియన్నాలో 2015 జూలై 14న కుదిరిన ఆ ఒప్పందంపై భద్రతామండలిలోని అయిదు శాశ్వత సభ్య దేశాల(అమెరికా, చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్)తో పాటు జర్మనీ, యూరప్ యూనియన్(ఈయూ)లు, ఇటుఇరాన్ సంతకాలు చేశాయి. ఆంక్షలు సడలించటానికి అంగీకరించాయి. ఆ సమయంలో కారాలూ మిరియాలూ నూరిన రిపబ్లికన్‌లు తాము అధికారంలోకొస్తే ఒప్పందాన్ని రద్దు చేస్తామని ప్రకటించారు. ఇజ్రాయెల్ సైతం ఒప్పందాన్ని చారిత్రక తప్పిదంగా అభివర్ణించింది. ట్రంప్ ఏక పక్షంగా ఒప్పందం నుంచి వైదొలగినప్పుడు తమతో ఎందుకు చర్చించలేదని భాగస్వామ్య పక్షాలు ప్రశ్నించాయి. తాము మాత్రం ఆ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని ప్రకటించాయి. జో బైడెన్ హయాంలో పాత ఒప్పందానికి ప్రాణప్రతిష్ఠ చేస్తారనుకుంటే సాధ్యపడలేదు.ట్రంప్ తాజా ప్రతిపాదనలో చర్చల ప్రస్తావన ఉన్నా నిజానికది మరిన్ని డిమాండ్లు తమముందుంచి లొంగదీసుకోవటానికేనని ఇరాన్ మత నాయకుడు ఆయతొల్లా అలీ ఖమేనీ చేసిన ప్రకటనను కొట్టిపారేయలేం. ఎందుకంటే ఇరాన్‌లో తమ కీలుబొమ్మ పాలకుడు మహమద్ రెజా పహ్లవీ (ఇరాన్ షా) 1979లో జరిగిన ఇస్లామిక్ విప్లవంలో పదవీచ్యుతుడైనప్పటినుంచీ అమెరికా ఆగ్రహావేశాలతో రగిలిపోయింది. ఆనాటినుంచి కొనసాగిన ఆంక్షల పర్వం ఎడతెరిపి లేకుండా నాలుగున్నర దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఎప్పటికప్పుడు కొత్త ఆంక్షలు విధించటం కూడా పరిపాటైంది. 1988లో 290 మందితో వెళ్తున్న ఇరాన్ ప్రయాణికుల విమానాన్ని సైనిక విమానంగా భావించి అమెరికా కూల్చివేసింది. తాను విధించిన ఆంక్షల్ని మరింత విస్తృతం చేయటానికి 2006లో భద్రతామండలిలో తీర్మానం చేయించింది. 2012లో ఈ ఆంక్షలు మరింత కఠినతరం చేశారు. పర్యవసానంగా పసిపిల్లలకు పాలడబ్బాలు, ఔషధాలు మొదలుకొని అనేక నిత్యావసర వస్తువులు దొరక్క ఇరాన్ ప్రజానీకం తల్లడిల్లిపోయారు. అకాల మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది.తన ప్రధాన ఆదాయ వనరైన ముడిచమురు ఎగుమతుల్లో సింహభాగం నిలిచిపోవటంతో... అమె రికా బ్యాంకుల్లోవున్న వేలాదికోట్ల విలువైన బంగారం, నగదు డిపాజిట్ల స్తంభించటంతో ఇరాన్ ఎన్నో అగచాట్లు పడింది. అణ్వాయుధాల విషయంలో ఇరాన్ వాదన సమంజసమైనది. అణు కార్య క్రమంపై కేవలం తమతోనే చర్చిస్తే సరిపోదని, పశ్చిమాసియా దేశాలను సైతం భాగస్వాముల్ని చేయాలని ఆ దేశం మొదటినుంచీ కోరుతోంది. ఆ చర్చ అంతిమంగా ఈ ప్రాంతంలో అణ్వస్త్ర నిషేధానికి తోడ్పడాలని వాదిస్తోంది. గత ఒప్పందం రద్దయ్యాక అమెరికా, ఇరాన్‌లమధ్య పర స్పరం అవిశ్వాసం పెరిగిపోయింది. దాన్ని తొలుత తొలగిస్తే తప్ప అడుగు ముందుకు పడదు. ట్రంప్ తాజా ప్రతిపాదనలోని ముఖ్యాంశాలేమిటో ఎవరికీ తెలియదు. ఒబామా హయాంలో కుదిరిన పాత ఒప్పందం ఇరాన్‌కు అనుకూలంగా ఉన్నదని ట్రంప్ ఆరోపించారు. దాన్ని మరింత పకడ్బందీగా మారుస్తామన్నారు. ఖమేనీ స్పందన స్పష్టంగా ఉంది. తాము కేవలం ఇరాన్ అణు కార్యక్రమానికి పరిమితమై మాట్లాడతామని, ఇతర అంశాలు ఒప్పుకోబోమని చెప్పారు. క్షిపణుల తయారీ వ్యవహారంపై మాట్లాడే ఉద్దేశంతోనే అమెరికా స్వరం మార్చిందని ఆయన అభిప్రాయంలా కనబడుతోంది. సంస్కరణవాది మసూద్ పెజెష్కియాన్ నిరుడు జూన్‌లో ఇరాన్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యాక ఆ దేశం వైఖరి మారింది. అగ్రరాజ్యాలతో చర్చించి 2015 నాటి అణు ఒప్పందం వంటిది కుదుర్చు కోవటానికి తాను సిద్ధమని ఆయన ఇప్పటికే చెప్పారు. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్‌కు మంచి సంబంధాలే వున్నాయి. ఇరాన్‌తో ఒప్పందానికి తన వంతు కృషి చేస్తానని ఇప్పటికే పుతిన్ హామీ ఇచ్చారు. అమెరికా నిఘా వర్గాల అంచనా ప్రకారం ఇరాన్ ఇంకా అణ్వస్త్ర తయారీ స్థాయికి ఎదగలేదు.ట్రంప్ తొలి ఏలుబడి నాటికి పశ్చిమాసియాలో ఇరాన్ దాదాపు ఏకాకి. సౌదీ అరేబి యాతో దానికి ఘర్షణ వాతావరణం ఉండేది. ఇప్పుడలా కాదు. ఇరాన్‌తో దాదాపు పశ్చిమాసియా దేశాలన్నిటికీ మెరుగైన సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రపంచ వాణిజ్యాన్ని ఛిద్రం చేస్తున్న యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్లతో ఇరాన్‌కు సాన్నిహిత్యముంది. అందువల్ల ఇరాన్‌తో నిజంగా ఒప్పందం కుదిరితే అది ప్రపంచ శాంతికి దోహదపడుతుంది. అయితే ఇరాన్‌నుంచి ఆశించే ఎలాంటి ఆచరణైనా ఇజ్రాయెల్‌కు కూడా వర్తింపజే సినప్పుడే ఇదంతా సాధ్యమవుతుంది. కాని పక్షంలో ఈ సమస్య రావణకాష్టంలా రగులుతూనే ఉంటుంది.

# ఆగమైపోతున్న.. తెలంగాన రైతన్న

మొదటిపేజీ తరువాయి

అన్నదాతల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కేటీఆర్ అన్నారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనం లో ఉందన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల గుండెలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండించుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు.

# రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

మొదటిపేజీ తరువాయి

రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# నేను అసెంబ్లీకి వస్తున్నా.. అంతా సిద్ధం కండి

మొదటిపేజీ తరువాయి

అరగంట ముందుగా 9:30 కే అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేసి మాట్లాడాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశర చేశారు. 'హామీల అమల్లో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి సుదీర్ఘంగా వివరించాలి. పదేళ్లలో బీఆర్ఎస్ నాలుగు లక్షల కోట్ల అప్పు చేస్తే కాంగ్రెస్ 14 నెలల్లోనే లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసింది. అప్పుల విషయంలో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలి. భారీగా అప్పులు చేసినా హామీలు అమలు చేయడం లేదు. రైతుబంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గొర్రెల పెంపకం.. చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్స్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ లు విడుదలచేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలు ఎండగట్టాలి. దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలి..' అని మాజీ సీఎం కేసీఆర్ సమావేశంలో తెలిపారు.

# మారిషస్ పర్యటనలో ప్రధాని మోడీ

## - అత్యున్నత పురస్కారంతో సత్కారం

మొదటిపేజీ తరువాయి

పర్యటనలో భాగంగా అక్కడున్న భారతీయులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున మారిషస్‌కి వచ్చాను. అప్పటికీ హోలీకి పది రోజులే ఉంది. ఈ సారి హోలీ రంగులను నాతో పాటు భారత్‌కు తీసుకెళ్తా. ఈ ప్రాంతానికి వస్తే నా సొంత ప్రదేశంలా అనుభూతి కలుగుతుంది. మనమంతా ఒకే కుటుంబం అంటూ ప్రసంగించారు. అనంతరం.. తనను అత్యుత్తమ పురస్కారంతో సత్కరించిన మారిషస్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

# పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా

మొదటిపేజీ తరువాయి

ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమేనని కవిత విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తీసుకువచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని మండిపడ్డారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలగడం లేదని అన్నారు. పసుపు పంటకు ధరలు పెంచుతామని, మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పారని .. కానీ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి పసుపు రైతులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# జనాభా పెరుగుదల ప్రస్తుత ఆవశ్యకత

- సాధారణ కాన్పులు పెరగాల్సి ఉంది
- సిజేరియన్లు తగ్గేలా చర్యలు తీసుకోవాలి
- జనాభా పెరుగుదల అన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం
- సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

జనాభా తగ్గడం వల్ల ఎంపీ సీట్లు తగ్గుతాయనే భావన ఉంది. నేనలా ఆలోచించటం లేదు. మనకు దేశం ముఖ్యం.. తర్వాతే రాష్ట్రం. దక్షిణాది రాష్ట్రాలు మేల్కొనాల్సిన సమయం వచ్చింది. జనాభా పెరుగుదల గురించి ఆలోచించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏపీ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'పాపులేషన్ డైనమిక్ డెవలప్‌మెంట్' సదస్సు జరిగింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ... సాధారణ ప్రసవాలు పెరగాలి, సిజేరియన్లు తగ్గాలన్నారు. రెండు జీతాలు, ఒక్క సంతానం చాలని చాలా మంది అనుకుంటున్నారు. జనాభా పెరుగుదలపై నిశ్శబ్దం వీడాలి, చర్చ జరగాలన్నారు. ప్రభుత్వం కూడా జనాభా పెరుగుదలకు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రసూతి సెలవులు ఎన్ని కాన్పులకైనా ఇస్తామని సీఎం ప్రకటించారు.

మన కుటుంబ వ్యవస్థ ప్రపంచంలోనే అద్భుతం. జనాభా పెంచాలనే ప్రతిపాదనతో ఇప్పుడు ముందుకెళ్తున్నాం. తెలుగువారు ప్రపంచంలో అన్ని చోట్లా కీలకంగా పనిచేస్తున్నారు. కీలక రంగాల్లో

అగ్రగామిగా ఉన్నారు. జపాన్, జర్మనీ.. భారతీయుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రపంచంలోని ప్రతి కంపెనీని భారతీయులే నడపాలని కోరుకుంటున్నా. తెలంగాణకు అధిక ఆదాయం రావటానికి అప్పట్లో తెదేపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణం అని పునరుద్ఘాటించారు. నిత్య విద్యార్థిని, నిరంతరం నేర్చుకోవటం నాకు ఇష్టం. నీటి లభ్యత , ఆహారం ఉత్పత్తి పెరగకుండా జనాభా పెరిగితే ఇబ్బందులు వస్తాయి. అందుకే జనాభా నిర్వహణ గురించి ఇప్పుడు చర్చ చేస్తున్నాం. అప్పట్లో జనాభా తగ్గుదల గురించి గట్టిగా పని చేశా. 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు జనాభా పెరుగుదల గురించి మాట్లాడాల్సి వచ్చింది.

రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా అమరావతి నిర్మాణం చేపట్టామని అన్నారు. ప్రధానిమోదీ వికసిత్ భారత్, నేను విజన్ 2047 అంటున్నాం. ఐదేళ్లుగా రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. అమరావతి నిర్మాణం కొనసాగి ఉంటే ఈపాటికి ఇక్కడ రూపురేఖలు మారిపోయేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయి. రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా అమరావతి నిర్మాణం జరగబోతోంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విస్తరణకు అవసరమైన భూమి, నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. అంకుర కేంద్రం ఏర్పాటు చేయాలని ఎస్ఆర్ఎంను కోరా. ఉద్యోగాలు చేసే వారిని కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారిని తయారు చేయాలని సూచించా. రాష్ట్రంలో ఇప్పుడు 2.58 లక్షల తలసరి ఆదాయం మాత్రమే ఉంది. 2047 కల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.58 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని చంద్రబాబు వివరించారు. పది సూత్రాల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పేదరికం లేని సమాజం కోసమే పీ4 విధానం. పేదలను పైకి తెచ్చేందుకు ప్రభుత్వాలు చేసే పనులతో పాటు మీరు కూడా సహకరించాలి. ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో సంపద పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలి. ఉద్యోగాల కల్పన చాలా ముఖ్యం. హార్డ్ వర్క్ కంటే స్మార్ట్ వర్క్ ముఖ్యం. పని విధానంలో మార్పులు రావాలి. ఉత్పాదకత పెరిగేలా, ఫలితాలు ఉండేలా పని చేయాలి. చదువుకున్న మహిళలు ఇంటి నుంచే పని చేసేలా ప్రణాళికలు. మగ వారికంటే మహిళలు బాగా పని చేయగలుగుతారు. ఐటి ఉద్యోగుల్లో మహిళలు మగవారి కంటే ఎక్కువ జీతాలు పొందుతున్నారు. సాంకేతికత సాయంతో వ్యవసాయం చేయాలి. గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఇంధన రంగంలో అగ్రగామిగా ఎదగాలి. అమరావతి మొత్తం సోలార్ ఎనర్జీ సరఫరా ఉండేలా చూస్తాం. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. అన్ని రంగాలకు క్వాంటం కంప్యూటింగ్ అనుసంధానం చేస్తామని చంద్రబాబు వివరించారు.

# అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

## పాత కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు అనుమతి

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను అదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారం

నాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# లెక్చరర్లకు నేడు నియామకపత్రాలు

## - రవీంద్రభారతిలో అందించనున్న సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి11**

జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మార్చి 12న బుధవారం నియామక పత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1,292 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు 240 మందిని ఇటీవల టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. కొత్తగా నియమితులైన లెక్చరర్లకు విద్యా శాఖ విధానాలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చి కాలేజీల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. కొత్త లెక్చరర్ల నియామకాలతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణకు పెద్దపీట


## - అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి గొట్టిపాటి

**అమరావతి,మార్చి11**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పట్టణీకరణ, బహుళ అంతస్తుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఎపి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల బిల్లు 2025ను అసెంబ్లీలో గొట్టిపాటి రవి ప్రవేశ పెట్టారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల భద్రత చాలా కీలకమని అన్నారు.

కబురు
KABURU TELUGU DAILY
బుధవారం మార్చి 12 2025

## డిఎల్పిఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ రెడ్డి



కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 11
బాన్సువాడ మండల ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాన్సువాడ డిఎల్పిఓ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎల్పిఓ గా గ్రామాల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చినట్లైతే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి... ఎంపీడీవో బషిరుద్దిన్




కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 11
బాన్సువాడ మండలంలోని మోగులన్ పల్లి తండా గ్రామపంచాయతీలో హరితహారం నర్సరీని మంగళవారం ఎంపీడీవో బషిరుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కంపోస్ట్ షెడ్, గ్రామంలోని డ్రైనేజీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పెరుగుతున్న మొక్కల పట్ల అశ్రద్ధ వహించరాదని, మొక్కలు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉందన్నారు. గ్రామాల్లో డ్రైనేజీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి దయానంద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



కబురు న్యూస్ మద్నూర్ మార్చి 11
మద్నూర్ మండలంలోని అవల్గావ్ గ్రామంలో 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే సిసి రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం స్థానిక ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు సహకారంతో రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, పనులను నాణ్యతతో చేపట్టి త్వరిత గతిగా పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండా గంగాధర్, ప్రమోద్ పటేల్, అమూల్, వినోద్, దత్తు, సాయిలు, యాదగిరి, హన్మాండ్లు, రాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పసుపు పంట విక్రయాలపై పకడ్బందీ పర్యవేక్షణ

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...
- అదనపు కలెక్టర్ కు పర్యవేక్షణ బాధ్యతలు...



కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,మార్చి 11 :
నిజామాబాద్ మార్కెట్ యార్డ్ లో పసుపు పంట విక్రయాలపై గట్టి పర్యవేక్షణ జరుపుతున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు విక్రయాల సందర్భంగా రైతులకు ఏ దశలోనూ నష్టం వాటిల్లకుండా వారు మోసాలకు గురి కాకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని అన్నారు.పసుపు క్రయ విక్రయాల నిశిత పరిశీలనకై సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేశామని,క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా కృషి చేస్తారని అన్నారు. అధికారులతో పాటు అదనపు కలెక్టర్ కూడా పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.మార్కెట్ యార్డ్ లో పసుపు పంట క్రయవిక్రయాలు సజావుగా జరిగేలా,రైతులకు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా సరైన గిట్టుబాటు ధర అందేలా, సకాలంలో వారికి ట్రేడర్లు డబ్బులు చెల్లించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరుపుతారని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. పసుపు పంట కొనుగోళ్లలో ఎవరైనా మోసాలకు పాల్పడుతూ రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరిస్తే,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# దర్పల్లి,సిరికొండ మండలాల్లో వరి పంటను పరిశీలించిన కలెక్టర్







కబురు న్యూస్,నిజామాబాద్, మార్చి 11 :
దర్పల్లి, సిరికొండ మండలాల్లోని ఆయా ప్రాంతాలలో ప్రస్తుత యాసంగిలో రైతులు సాగు చేస్తున్న వరి క్షేత్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం పరిశీలించారు. బోరుబావుల కింద సాగవుతున్న వరి పైరు ఏ స్థితిలో ఉంది, సాగునీటి లభ్యత ఏ మేరకు అందుబాటులో ఉంది అన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. దర్పల్లి మండలం చెరువుతండా శివారులో ఒడ్డేటి చిన్నసాయిలు, సిరికొండ మండలం పెద్దవాల్గోట్ శివారులో శోభన్ రాజు అనే రైతులకు చెందిన వరి పైర్లు పాక్షికంగా కొంత విస్తీర్ణంలో ఎండుముఖం పట్టడాన్ని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాల గురించి వ్యవసాయ అధికారులను, సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవలం బోరు బావులపైనే ఆధారపడి పంటలు వేసిన తరుణంలో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయి వరి పంటకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పై మండలాలలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో పంట ఎండిపోయే దశకు చేరింది, మిగితా విస్తీర్ణంలో వరి పంట దిగుబడులు చేతికి వచ్చేందుకు ఇంకా ఎంత సమయం పడుతుంది, ఎన్ని తడులు నీరు అవసరం అవుతుంది, గతేడాది యాసంగిలో పంటల పరిస్థితి ఎలా ఉండింది, ఏ రకం ధాన్యం సాగు చేస్తున్నారు తదితర వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఎండుముఖం పడుతున్న పంటలకు సాగు అందించేందుకు వీలుగా ఏవైనా ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉంటే పరిశీలించాలని అధికారులకు సూచించారు.కాగా,సాగునీటి విషయమై రైతుల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కనీసం వచ్చే యాసంగి సీజన్లో నైనా సాగునీరు వనరుల లభ్యతను బట్టి తగిన పంటలు వేసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. ముఖ్యంగా బోరుబావులపైనే ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులకు భూగర్భ జలాల పరిస్థితి గురించి వివరిస్తూ,రబీలో పూర్తి విస్తీర్ణంలో వరి పంట వేయకుండా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా చూడాలని, క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు,సూచనలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, ఏ.ఓలు బి.శ్రీనివాస్ రావు, వెంకటేష్,ఏ.ఈ.ఓ లక్ష్మిప్రసన్న, తహసీల్దార్ మాలతి తదితరులు ఉన్నారు.

# ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల చొరవ

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...
- 25 శాతం రిబేటు సదుపాయాన్ని వినియోగించుకోవాలని హితవు...



కబురునేస్,నిజామాబాద్ కలెక్టరేట్,మార్చి 11 :
జిల్లాలో లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్.ఆర్.ఎస్) కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తి స్థాయి ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు చొరవ చూపుతున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ నెల (మార్చి) 31 లోపు పూర్తి స్థాయి ఎల్.ఆర్.ఎస్ ఫీజుతో పాటు ప్రో-రాటా ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించే వారికి ప్రభుత్వం 25 శాతం రిబేటు వర్తింపజేస్తోందని గుర్తు చేశారు.దీంతో దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు స్వతహాగా ముందుకు వస్తున్నారని అన్నారు.ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబేటును మినహాయిస్తూ,వెంటదివెంట ల్యాండ్ రెగ్యులరైజేషన్ కు సంబంధించిన ప్రొసీడింగ్ లు జారీ చేయడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు.ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 190 మంది ఎల్.ఆర్.ఎస్ ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారని తెలిపారు. ఇందులో రిబేట్ ప్రకటించిన తరువాత 65 మంది ఫీజు చెల్లించారని,మంగళవారం ఒక్క రోజే 15 మంది దరఖాస్తుదారులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకున్నారని వివరించారు.అదేవిధంగా భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో 26 మంది, బోధన్ లో 104 మంది ఎల్.ఆర్.ఎస్ ఫీజు చెల్లించారని తెలిపారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు 895 మంది ఫీజు చెల్లింపులు పూర్తి చేశారని, ఎల్.ఆర్.ఎస్ కింద రూ.12.45 కోట్ల రుసుము వసూలయ్యిందని కలెక్టర్ వివరించారు.మిగితా దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువు లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్దీకరణ చేసుకోవాలని, రిబేటు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ది పొందాలని హితవు పలికారు.దరఖాస్తుదారుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయించామని,దరఖాస్తుదారులు సంప్రదించవచ్చని సూచించారు.బఫర్, ఎఫ్.టి.ఎల్, చెరువులు, కుంటలు వంటి నిషేధిత జాబితాలోని ప్రాంతాలను మినహాయిస్తే, ఇతర ప్రాంతాలలోని ప్లాట్లకు ఆన్లైన్ లో సులభంగా అనుమతి లభిస్తోందని అన్నారు.చెరువులు,నీటి వనరులకు సమీపంలో కనీసం 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ వెల్లడించారు.ఎల్ ఆర్ ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులలో 90% రిఫండ్ అవుతుందని, 10 శాతం ప్రాసెసింగ్ చార్జెస్ కింద తీసుకుంటారని అన్నారు .స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని,ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నామని అన్నారు.ఎల్.ఆర్.ఎస్ అనుమతులు లేని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబడవని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమ బద్దీకరణ చేసుకోవాలని, మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన రిబేటు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 25 శాతం రాయితీ పొందాలని కలెక్టర్ సూచించారు.

# మహిళలు అన్ని రంగాలలో ఎదగాలి : జిల్లా జడ్జి పద్మావతి

- మహిళలు స్వశక్తిగా ఎదగాలి : గైనకాలజిస్ట్ డాక్టర్ బండారి సుజాత
- ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు...




కబురు న్యూస్,నిజామాబాద్ ప్రెస్ క్లబ్,మార్చి 11 :
మహిళలు అన్ని రంగాలలో ఎదుగాలని జిల్లా జడ్జి పి పద్మావతి అన్నారు.మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ లో ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత అధ్యక్షతనగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా జడ్జి పి.పద్మావతి మాట్లాడుతూ ఐద్వా మహిళా సంఘం పోరాటాలే కాకుండా మహిళలను చైతన్య పరచడంలో ముందుంటుందని అభినందించారు.మహిళాలకు ఉన్న సమస్యలను జిల్లా న్యాయ సలహా సంస్థలకు తెలియజేస్తే వారి సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తామని అన్నారు.మహిళలు చదువుల్లోనే కాకుండా పోరాటాలలో ముందుండాలని తెలిపారు.గైనకాలజిస్ట్ డాక్టర్ బండారి సుజాత మాట్లాడుతూ,మహిళలు స్వశక్తిగా ఎదగాలని సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలని హితవు పలికారు. టెక్నాలజీని అందుపుచ్చుకొని మహిళా హక్కులను తెలుసుకొని ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు.తల్లిదండ్రులు ఆడ మగ అనే భేదం లేకుండా పిల్లల్ని సమానంగా చూసినప్పుడే ఈ సమాజం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని అన్నారు.ఉమెన్ వెల్ఫేర్ చైల్డ్ ఆఫీసర్ రసూల్ బి మాట్లాడుతూ, మహిళల పై దాడులు జరిగితే సఖి సెంటర్ల ద్వారా,అంగన్వాడీల ద్వారా సమాచారం అందించాలని అన్నారు.మహిళలకు సమస్యలు వస్తే ఈ టోల్ ఫ్రీ నంబర్లకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098,సఖి హెల్ప్ లైన్ 181 సమాచారం అందిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని.అదేవిధంగా ఐద్వా ఇలాంటి సెమినార్లు అనేకంగా నిర్వహించి మహిళలలో చైతన్యం నింపాలని పొగిడారు.ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ స్విమ్మర్ పూర్ణ ఆకాశంలో సగం అమ్మలో సగంగా మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నారని వారందరూ ఐక్యంగా వారి సమస్యలపై పోరాటాలు చేయాలని సూచించారు.అదేవిధంగా మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులతో పాటుగా మహిళా జర్నలిస్టులను,ఆర్టిజన్,అంగన్వాడీలను ఆశలను సన్మానించడం జరిగింది.మహిళ పోరాట యోధురాల్ల చరిత్రను తెలపడం కోసం(రమాబాయి,సావిత్రిబాయి పూలే,ఝాన్సీ లక్ష్మీబాయి)చిన్నారుల వేషధారణతో పాటుగా ఆటపాటలతో పీఎన్ఎం జిల్లా కార్యదర్శి సిరిపలింగం బృందం ఆకట్టుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత,స్వర్ణలత రేణుకా,కళ,రేఖ,శ్రీదేవి,విమల,లక్ష్మితదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

- 852 విద్యార్థులు గైర్హాజర్...
- ఒక విద్యార్థి పై మాల్ ప్రాక్టీస్ కేసు...



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 11 :** ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం మొదటి సంవత్సరం బొటనీ,పొలిటికల్ సైన్స్, మ్యాథ్స్ -1ఏ పరీక్షలు జరిగాయి. మొత్తం 852 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో మొత్తం 21,218 మంది విద్యార్థులకు గాను 20,366 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 96 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. డిచ్ పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి చీటీలు రాస్తుండగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని డిఐఈవో తెలిపారు.జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 54 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు తాను ఫ్లయింగ్,సిట్టింగ్ స్క్వాడ్ లు,హై పవర్ కమిటీ,బల్క్ అధికారి,కస్టోడియన్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారని తెలిపారు.జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ బోధన్ పట్టణంలోని మధుమలాంఛ జూనియర్ కళాశాల,విద్య వికాస్ జూనియర్ కళాశాల రెండు కేంద్రాలు,బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల,విజేత జూనియర్ కళాశాల,ఉషోదయ జూనియర్ కళాశాల రెండు కేంద్రాలు,విజయ సాయి,షిరిడీ సాయి జూనియర్ కళాశాల లను తనిఖీ చేసి సమీక్షించారు.హై పవర్ కమిటీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో 7 జూనియర్ కళాశాలలు,పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య,రజీయుదిన్ అస్లాం,కనకమహాలక్ష్మి 16 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నర్సయ్య, బాలాజీ, యమున బృందం 16 పరీక్ష కేంద్రాలను,సిటింగ్ స్కాడ్ బృందాలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

# అసంపూర్తిగా ఉన్న పనులను పాక్షికంగా పూర్తి చేయాలి

- ఆర్అండ్ బి అధికారులతో సమీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...





**కబురు న్యూస్, నిజామాబాద్ టౌన్,మార్చి 11 :** టీయూఎఫ్ఐడీసీ కింద విడుదల అయినా నిధులను డివిజన్ లలో రోడ్లు, డ్రైనేజీ పనులు పాక్షికంగా, అసంపూర్తిగా జరిగిన పనులను పూర్తి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆర్ అండ్ బి శాఖాధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్ బి శాఖాధికారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ కింద డివిజన్ కి కోటి రూపాయల చొప్పున మంజూరు అయినా నిధుల పెండింగ్ విషయం గతంలో పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం,ఇంచార్జి మంత్రి స్పందించి 2023 మార్చ్ పెండింగ్ లో ఉన్న టీయూఎఫ్ఐడీసీలో 38 కోట్ల రూపాయలు కార్పొరేషన్ లో డివిజన్ల అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతతో చేపట్టాలని,వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజా ఉపయోగం లోకి తీసుకురావాలని సూచించారు. అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పని చేయాలనీ అన్నారు. నగరంలో రోడ్ మరమ్మతులు జరగడం లేదని గుంతలు పడ్డ రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. నగరంలో గుంతలు పుడ్చాలని అదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ శ్రీమాన్ నారాయణ, డిఈ ప్రవీణ్,మునిసిపల్ డిఈ రషీద్,కాంట్రాక్టర్లు,అధికారులు పాల్గొన్నారు.

# నవోదయ ఏర్పాటులో ఎంపీ పాత్ర లేదు

- రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి...



**కబురు న్యూస్,నిజామాబాద్ రూరల్,మార్చి 11 :** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కేంద్రం నవోదయ విద్యాలయం కేటాయిస్తే దానిని ఏర్పాటు చేయడంలో ఎంపీ అరవింద్ పాత్ర ఏమి లేదని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం మూడుసార్లు జిల్లా కలెక్టర్ ద్వారా జక్రాన్ పల్లి మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయించి ప్రతిపాదించింది తానేనని అన్నారు. కానీ ఎంపీ కలిగోట్ వద్ద ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయడంతోనే అది తిరస్కరణకు గురైందని, తాను ప్రతిపాదించిన జక్రాన్ పల్లి మండల కేంద్రంలో ప్రతిపాదించి ఉంటే నవోదయ విద్యా సమితి అనుమతించేది అన్నారు. నవోదయ విద్యాలయం ఏర్పాటు వ్యవహారం దానికి సంబంధించిన ప్రత్యేక కమిటీ పరిశీలనతోనే జరుగుతుందని ఎంపీ కలిగోట్ వద్ద సూచించిన భూమి జాతీయ రహదారికి 12 కిలో మీటర్ల లోపల ఉందని వారు ఏర్పాటు ప్రతిపాదనలను తిరస్కరించారని గుర్తు చేశారు. 2022లోనే కేంద్రం కొత్త జిల్లాలలో నవదోయ విద్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు కోరితే ఆనాటి నుంచి ఎంపీగా ఉన్న అరవింద్ చేసిన కృషి లేదని అందుకే 2024లో తమ ప్రభుత్వ హయంలో ఏర్పాటుకు తాము ముందుకు వచ్చామన్నారు. గతంలో అధికారులు చేసిన ప్రతిపాదనల్లోనే బోధన్ లో నవదోయ విద్యాలయం స్థల విషయం ఉందని దానిని కొత్తగా పంపించలేదని అధికారులే ఆ ప్రతిపాదన చేశారన్నారు. సీనియర్ నేతగా, ప్రజాప్రతినిధిగా సుదర్శన్ రెడ్డి బోధన్ లో నవోదయ విద్యాలయాన్ని ప్రతిపాదన చేయడంలో తప్పేమి ఉందన్నారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని తాము రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో క్వింటాల్ కు రూ.25 వేల ధర వస్తుందని ప్రకటించిన ఎంపీ అరవింద్ ఆ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో హామీ మేరకు తాము ఇస్తామన్న ధరలో ఎంపీ ఇచ్చిన హామీ సగానికి అమలు చేసిన రైతులకు లాభమేనని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సీనియర్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి తదితరులున్నారు.

# పసుపు ధరపై జిల్లాలో రైతులు ఆందోళన చెందవద్దు

- నుడా చైర్మన్ కేశ వేణు...



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 11 :** గత మూడు నాలుగు రోజులుగా పసుపు ధరపై జిల్లాలో రైతులు ఆందోళన చెందుతున్నారని,పసుపు కొనుగోళ్లకు ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్ ను కోరామని, ప్రత్యేకాధికారిని నియమించి రైతులకు న్యాయం చేస్తామని ఆందోళన చెందొద్దని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. జిల్లా కాంగ్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో కలిసి మాట్లాడారు. పసుపు ధర పెరిగిన సమయంలో అది కేంద్ర ప్రభుత్వ గొప్పతనమని,ఎగుమతులు చేపట్టడం ద్వారా ధర పెరిగిందని గొప్పలు చెప్పుకున్న ఎంపీ అర్వింద్, ప్రస్తుతం ధర తగ్గినా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పసుపు బోర్డు తీసుకువచ్చానని గొప్పులు చెప్పుకునే ఎంపి అర్వింద్,నిజామాబాద్ లో పసుపు పండిస్తే బోర్డును ఢిల్లీలో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే పసుపు బోర్డును నిజామాబాద్ లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పసుపు ధర ఎందుకు తగ్గిందో చెప్పాల్సిన బాధ్యత జాతీయ పసుపు బోర్డు చైర్మన్, ఎంపీపై ఉందన్నారు.పసుపు రైతుల సమస్యల పరిష్కారం కోసం తామెల్లప్పుడూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో నిరుద్యోగులు,ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ అండగా నిలిచినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోవడం నిరాశకు గురి చేసిందని మోహన్ రెడ్డి అన్నారు.తాము అధికారంలోకి వచ్చిన తరువాత 56వేల ఉద్యోగాలు ఇచ్చినా పట్టభద్రులు తమకు ఓటెందుకు వేయలేదో అర్థం కావడం లేదని,ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై జిల్లా కాంగ్రెస్ నాయకులందరం కలిసి సమీక్షిస్తామన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు.సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు గోపి,ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు రాజ్,బింగి శుభం,సాయి కిరణ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలి.... సబ్ కలెక్టర్ కిరణ్మయి




**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 11** మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు తమ లక్ష్యాలను ఏర్పరచుకొని కష్టపడి పనిచేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి మంగళవారం బాన్సువాడ మండలంలోని దేశయి పేట్ గ్రామ శివారులో గల నర్సింగ్ కళాశాలలో ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ కిరణ్మయి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ మహిళలు చిన్ననాటి నుండే విద్య, ఆర్థిక, రాజకీయ సామాజిక రంగాలలో ముందుండేందుకు కష్టపడి చదివి రాణించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం మార్పు చెందుతుందని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భూలక్ష్మి, ఉపాధ్యాయుని బృందం, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పల్లె ప్రకృతి నర్సరీల నిర్వహణ పక్కాగా చేపట్టాలి... మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 11** గ్రామాల్లో పల్లె ప్రకృతి, నర్సరీలు, పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలోని పల్లె ప్రకృతి, నర్సరీలను ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, డిఎల్పిఓలతో కలిసి పరిశీలించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, నర్సరీలో పెరుగుతున్న మొక్కల పట్ల అశ్రద్ధ కనపరచకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈవో రాజు, ఎంపీడీవో బషిరుద్దీన్, డిఎల్ పి ఓ సత్యనారాయణ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్,ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో ఘనంగా రామారావు మహారాజ్ విగ్రహ వార్షికోత్సవం





**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 11** బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని సాయి కృపా నగర్ కాలనీలో గల రామారావు మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన జరిగి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని ఆల్ ఇండియా బంజారా శక్తి పీట్ ప్రధాన కార్యదర్శి బాధ్య నాయక్ రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదంబ, సేవాలాల్ రామారావు మహారాజ్ ల భోగ్ బండార్, ప్రత్యేక పూజలు నిర్వహించి, హోలీ లేగి ఆట ఆడి అలరించారు.. ఈ సందర్భంగా బద్య నాయక్ మాట్లాడుతూ రామ్ రావు మహారాజ్ చూపిన భక్తి మార్గంలో ప్రతి తండాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని, ప్రతి ఒక్కరు మద్యపానానికి దూరంగా తమ కుటుంబాలతో ఆనందంగా గడుపుకోవాలన్నారు. ఈనెల 19న రంగ్ పంచమిన వెంకటాపూర్ లోని బాయ్ గాడ్ లో జరిగే జాతర మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు సింగ్, గోప్య నాయక్, బన్సీలాల్ మోహన్ నాయక్, మహేష్, భూమేష్, సురేష్, బీమా, బంజరులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 11 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఈ నెల 12న ఉదయం 11.00 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ తెలిపారు.జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికైన ప్రముఖ మహిళలను సన్మానించడం జరుగుతుందని తెలిపారు.

# లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన పోచారం



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 11**
బాన్సువాడ పట్టణంలోని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి తన నివాసంలో కోటగిరి, వర్ని, చందూర్ మండలాలకు చెందిన 82 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు గంగాధర్,కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హనుమంతు, డిసిసి డెలిగేట్ కొట్టం మనోహర్ ,వైస్ చైర్మన్ అనిల్, సాయి రెడ్డి, నాయకులు రేంజర్ల సాయిలు, శనిగరం కిషన్, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులు హేయమైన చర్య..



**కబురు న్యూస్,బోధన్ మార్చి 11..**
పట్టణ పోలీసులు తమను అకారణంగా ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని బోధన్ నిజాం షుగర్ కర్మగార కార్మిక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఇండస్ట్రీ మినిస్టర్ శ్రీధర్ బాబు లను హైదరాబాద్ నగరంలో మంగళవారం కలిసి మాకు రావాల్సిన 10 సంవత్సరాల వేతన బకాయిలు ఇప్పించాలని, సెటిల్మెంట్ చేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో నిజాం షుగర్స్ కార్మికులను బోధన్ పోలీస్ లు సోమవారం అర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఫ్యాక్టరీ లే ఆఫ్ అయినప్పటి నుండి నేటి వరకు ఉన్న బకాయి వేతనాలు ఇచ్చి సెటిల్మెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా అరెస్టైన నాగుల రవిశంకర్ గౌడ్, ఉపేందర్, కుమారస్వామి, బాలకృష్ణ, శ్రీనివాస్, మల్లేష్, బాలచందర్ లను వెంటనే విడుదల చేయాలని, వారికి రావలసిన బకాయి వేతనాలు చెల్లించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, బిజెపి నాయకులు అడ్లూరి శ్రీనివాస్, రామరాజు, పెరక వెంకటేష్ లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరారు.

# పన్నులు సకాలంలో చెల్లించాలి...



**కబురు న్యూస్,బోధన్ మార్చి 11..**
పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ ప్రజలను కోరారు. మంగళవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ పట్టణంలో పన్ను వసూళ్ల ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాన్ గల్లీ లో గల గౌడ సంఘ ప్రతినిధులు తమ సంఘానికి చెందిన ఆస్తి పన్ను బకాయి ఉన్న 2,68,768 రూపాయలను మున్సిపల్ కమీషనర్ కు అందజేశారు.

# గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై ఉక్కు పాదం మోపాలి.... డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి




**కబురు న్యూస్ ఎల్లారెడ్డి, మార్చి 11**
గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై నిఘా ఉంచి ఉక్కు పాదం మోపాలని అధికారులకు డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ కార్యాలయంలో 2006 నుంచి కేసుల వివరాలు, దస్త్రాలను తనిఖీ చేసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, ఎస్సై జగన్మోహన్, ఎక్సైజ్ సిబ్బంది పెంటయ్య, జనార్ధన్,ఆనంద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య-శాఖలో మహిళా దినోత్సవ వేడుకలు



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 11 :**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో మహిళా దినోత్సవాల వేడుకలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి.రాజశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ వో రాజశ్రీ మాట్లాడుతూ మహిళలందరూ వారి వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వారికి కేటాయించిన విధులను,కుటుంబ బాధ్యతలను సమన్వయ పరుచుకుంటూ పని చేయడం చాలా గొప్ప విషయమన్నారు.అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నందున పని ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ స్ట్రెస్ కు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కార్యాలయంలో పనిచేసే మహిళలందరినీ శాలువా,బహుమతులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ డాక్టర్ నాగరాజు ,ఏవో రాజేశ్వర్, పి వో ఎన్ సి డి డాక్టరు సామ్రాట్ యాదవ్,పిఓఎంసిహెచ్ డాక్టర్ సుప్రియ, డి ఈ డాక్టర్ వెంకటేష్,డెమో నాగలక్ష్మి,సూపర్ ఇండెంట్ లు పద్మ,వినయ్ కుమార్,డిపిఓ విశాల,డిహెచ్ఈ లు ఘన్ పూ ర్ వెంకటేశ్వర్లు, వేణుగోపాల్,సందీప్,సుమ, సృజన,గంగామణి,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమానితునితో ఠాణాను శుభ్రం చేయించిన పోలీస్...




**- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు..**

**కబురు న్యూస్,బోధన్ మార్చి 11..**
ఓ కేసులో అనుమానితునిగా ఉన్న యువకునితో పట్టణ ఠాణా ను శుభ్రం చేయించిన ఘటన బోధన్ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం ఓ చోరీ చేశాడని ఆరోపణ కేసులో బెల్లాల్ గ్రామానికి చెందిన యువకున్ని సోమవారం రాత్రి అరెస్టు చేసి కాళ్లకు సంకెళ్లు వేసి పట్టణ ఠాణా లో ఉంచారు. మంగళవారం ఉదయం అనుమానితునిగా ఉన్న యువకునితో పట్టణ ఠాణా ను శుభ్రం చేయిస్తున్న వీడియో నెట్టింట వైరల్ అయింది. ఈ దారుణ సంఘటన పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అనుమానితునిగా ఉన్న వారితో ఇలాంటి చాకిరీ చేయిస్తున్న విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# రికార్డులను పరిశీలించిన మండల విద్యాధికారి నాగయ్య...



**కబురు న్యూస్,బోధన్ మార్చి 11..**
సంవత్సరీక తనిఖీలలో భాగంగా బోధన్ పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో గల ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల, మండలంలోని కల్దుర్కి గ్రామంలో గల ఇంగ్లీష్ మీడియం మండల ప్రాథమిక పాఠశాలలను రిసోర్స్ పర్సన్లు ఎండి అజార్, ఎండి అసాద్ హుస్సేన్, వెంకన్న, సందీప్, హనుమాండ్లు ల చేత అకాడమిక్ పరిశీలన చేసినట్లు బోధన్ మండల విద్యాధికారి నాగయ్య తెలిపారు. పాఠశాలలోని అన్ని తరగతులలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల పాఠ్య బోధన పరిశీలించడం జరిగిందని, పాఠ్యప్రణాళిక, సూక్ష్మ బోధన ఏ విధంగా జరుగుతుందో రికార్డు చేయడం జరిగిందన్నారు. తరగతి గదిలో విద్యార్థిని, విద్యార్థుల ప్రతిస్పందనలు, సామర్థ్యాలను సబ్జెక్టుల వారిగా రికార్డ్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్, ఉపాధ్యాయుల, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల రిజిస్టర్, మధ్యాహ్న భోజనం రిజిస్టర్, విద్యార్థుల గ్రేడింగ్ రిజిస్టర్లు, సెంట్రల్ మార్క్స్, అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్, విద్యార్థుల ఆరోగ్యపరమైన రిజిస్టర్స్, క్యాష్ బుక్, పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానాల మొదలైన అన్ని రకాల రిజిస్టర్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన దంత వైద్యుడు అచ్చుకట్ల జీవన్



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 11**
బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల దృష్ట్యా పట్టణంలోని రుక్మిణి దంత వైద్యశాల ఆసుపత్రి నిర్వాహకులు వైద్యులు అచ్చుకట్ల జీవన్ తన తండ్రి మారుతి జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు అచ్చుకట్ల జీవన్



మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థికి పదవ తరగతి ఎంతో ముఖ్యమైందని, పరీక్షలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా విద్యార్థులు పరీక్షలు మంచిగా రాసి విద్య నేర్పిన గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చి సమాజంలో ఉన్నత స్థానంలో ఎదగాలని ఆయన విద్యార్థులను ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డాక్టర్ అచ్చుకట్ల జీవన్ ను పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో నేడు,రేపు యధావిధిగా పసుపు తూకాలు

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 11 :
నిజామాబాద్ మార్కెట్ యార్డులో బుధ, గురువారాల్లో పసుపు పంట తుకాలు యధావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి అపర్ణ తెలిపారు.సోమ,మంగళవారాల్లో అమ్మకాల నిమిత్తం మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున పసుపు పంట నిల్వలు వచ్చాయని అన్నారు.బిడ్డింగ్ పూర్తయిన లాట్లకు బుధ,గురువారాల్లో తూకాలు జరుగుతాయని, బిడ్డింగ్ కాకుండా మిగిలిపోయిన పసుపు నిల్వలకు బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# విలువలతో కూడిన జర్నలిజం అవసరం

**- ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్...**







**కబురు న్యూస్,రంగారెడ్డి,మార్చి11 :**
తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్న లిస్ట్ మరియు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ద్వితీయ మహాసభ ప్రగతి రిసార్ట్ లో మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐజెయు మాజీ జాతీయ అధ్యక్షుడు దేవులపల్లి అమర్,తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు విరాహత్ అలీ భారత రాష్ట్ర సమితి జాతీయ స్పోక్స్ పర్సన్ కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు.ఈ సంద ర్భంగా ఐజెయు మాజీ అధ్య క్షుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, విలువల తో కూడిన జర్నలిజం అవసరం ఉన్నదని ఆయన అన్నారు.జర్నలిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవ హరి స్తున్న తీరు ఆక్షేపనీయంగా ఉన్నదని ఆయన అన్నారు.జర్న లిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన దుయ్యబట్టా రు.దేశంలోనే అధిక ఆదాయాన్ని దేశానికి ఇస్తున్న జిల్లాగా రంగారెడ్డి ప్రథమ స్థానంలో నిలుస్తుందన్నారు.స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.జర్నలిస్టుల సమస్యలపై దశాబ్దాల కాలంగా యూనియన్ చేస్తున్న కృషిని గుర్తు చేశారు.తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన అగ్ర జర్నలిస్టులు తమ యూనియన్ వారే అన్నారు.నాడు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి తెలంగాణ ఉద్యమంలో పనిచేస్తే ఆంధ్రప్రదేశ్ లో సంఘం నుండి వ్యతిరేకత వచ్చిన ముందుకెళ్లినట్లు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వాల్లో మన యూనియన్ నుండి ప్రాతినిధ్యం వహించిన పాత్రికేయుల సంక్షేమాన్ని ఎన్నడూ విస్మరించలేదన్నారు.జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ,ఇటీవలికాలంలో జర్నలిజ%శీ%లో చోటు చేసుకున్న సంఘటనలు బాధాకరమని అన్నారు.జర్నలిస్టులు ప్రజల గొంతుకలుగా పనిచేయాలన్నారు.గత ప్రభుత్వం తమ సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర స్టేట్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ పుట్టగొడుగుల్ల అనేకమంది జర్నలిస్టులమని చెప్పుకొని తిరుగుతూ వ్యవస్థ ను పలుచన పడేస్తున్నారని ఆయన అన్నారు, ఇట్లాంటి వాటిపై జర్నలిస్టులు దృష్టి కేంద్రీకరించ వలసిన అవసరం ఉన్నదని ఆయన పిలుపు నిచ్చారు, భారత రాష్ట్ర సమితి స్పోక్స్ పర్సన్ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా నిలబడతామని ఆయన హామీ ఇచ్చారు, రాబోయే రోజుల్లో అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సంక్షేమం పై ప్రత్యేక దృష్టితో ఆలోచన చేసేందుకు బాధ్యత తీసుకొని మీకు అండగా నిలబడతానని ఆయన జర్నలిస్టులకు భరోసా కల్పించారు, జిల్లాలోని జర్నలిస్టులకు 5 లక్షల రూపాయల ప్రమాద బీమా రక్షణకు అవ సర పడిన ప్రీమియమును అందజేసిన భారత రాష్ట్ర సమితి జాతీయ స్పోక్స్ పర్సన్ కార్తీక్ రెడ్డికి జిల్లా కార్యవర్గము కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్య క్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ,కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి,మధు గౌడ్,కోశాధికారి వెంకట్ రెడ్డి,రాష్ట్ర ముఫిసిల్ కమిటీ చైర్మన్ పేపర్ శ్రీనివాస్,చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబా,రాష్ట్ర కార్యదర్శి అశోక్ కుమార్,,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు,ఎన్నికల అధికారి బాలరాజు గౌడ్,జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ లు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా అధ్యక్షులుగా ఎండి సలీమ్ పాషా,కార్యదర్శిగా సత్యనారాయణలు ఎన్నికయ్యారు.

కబురు
KABURU TELUGU DAILY
బుధవారం మార్చి 12 2025

# మానకొండూర్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు రూ.200 కోట్లు మంజూరు...

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి వెల్లడి....



**కబురు న్యూస్, శంకరపట్నం మార్చి 11**
యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని యాదవుల పల్లిలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ప్రెసిడెంట్ స్కూలుతో సహా రాష్ట్రవ్యాప్తంగా 55 స్కూళ్లకు రూ.11,000 కోట్లు మంజూరు చేసింది.ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ ఉత్తర్వులు చేసినట్టుగా మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు.55 అసెంబ్లీ నియోజకవర్గా ల్లో ఏర్పాటు కానున్న సమీకృత గురుకులాల నిర్మాణం కోసం ఒక్కో స్కూల్ కి రూ. 200 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గానికి ఒక్కొక్కటి చొప్పున మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 119 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా, ఇందులో తొలివిడతగా 55 నియోజక వర్గాల్లో గురుకులాల నిర్మాణం చేపట్టింది. వీటిలో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అకాడమిక్ బ్లాక్, స్టాఫ్ క్వార్టర్స్, లైబ్రరీ, క్రీడా ప్రాంగణం, బాలురు, బాలికల హాస్టల్ బ్లాకులు నిర్మిస్తారు. బోధన్, బోధనేతర సిబ్బందికి కూడా కి నివాస సముదాయాలు ఇందులో ఉంటాయి.ఒక్కో భవనంతి నిర్మాణానికి రూ. 135 కోట్లు , ఇతరత్రా అవసరాలు, పన్నుల కోసం అదనంగా రూ.65కోట్లు వెరసి రూ.200 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది.నిధుల మంజూరుపై ఎమ్మెల్యే కవ్వంపల్లి హర్షం..మానకొండూర్ యాదవులపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 200 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు దసరా చర్యలు తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వం పేద పిల్లలకు విద్యను దూరం చేసే ప్రయత్నం చేసిందని,రాష్ట్రంలో 5 వేల ప్రభుత్వ పాఠశాలలను మూతపడటం ఇందుకు నిదర్శనమని, ఎమ్మెల్యే సత్యనారాయణ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు నడుం బిగించిందని,అందులో భాగంగానే యంగ్ ఇండియా ఇండిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలు చేపట్టిందని ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు.

# ఇన్స్పైర్ మానక్ అవార్డ్స్ అందుకున్న యూనివర్సల్ విద్యార్థులు:



**కబురు న్యూస్,పాలకుర్తి మార్చి11:**
పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం గన్ శ్యామ్ దాస్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రముఖ పాఠశాల ఐఐటి ఫౌండేషన్ స్కూల్ విద్యార్థుల ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రభంజనం.డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్స్పైర్ మాన్ పోటీలలో భాగంగా స్మార్ట్ మెడిసిన్ రెమిడీల్ స్మార్ట్ కంపోస్ట్ బిన్ అనే అంశాలపై యూనివర్సల్ విద్యార్థులైన 9వ తరగతి విద్యార్థి ఎండి. అల్తాఫ్, పి.అక్షర 8వ తరగతి సిహెచ్ శ్రీ నిత్య, ఏడవ తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఎంఈఓ టి. విమల విద్యార్థులను ప్రశంసిస్తూ సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఎండి. ఇస్మాయిల్ ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అబ్జల్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులకు కూడా పాఠశాల ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.




# వాహనదారులకు ప్రాణాంతకంగా మారిన జమ్మికుంట ఫ్లైఓవర్ రోడ్డు డివైడర్లు

**కబురు న్యూస్, జమ్మికుంట**
జమ్మికుంట పట్టణంలో రైల్వే లైన్ వల్ల వాహనదారులకు ఇబ్బంది ఏర్పడుతున్నదని నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పైన ఏర్పాటుచేసిన సిమెంటు డివైడర్లు వాహనదారుల పట్ల ప్రాణాంతకంగా మారి, గత ఐదు సంవత్సరాలలో అనేకమంది మృత్యువాత పడ్డారు, ఎంతోమంది ఆసుపత్రులపాలై వికలాంగులుగా జీవితం గడుపుతున్నారు.జమ్మికుంట ఆర్ఓబి కొత్తపెల్లి హనుమాన్ జంక్షన్ నుంచి మొదలై బస్టాండ్ వరకు, మరోవైపు మోతుకులగూడెం వైపు విస్తరించి ఉంది .ఫ్లైఓవర్ పై సెంటర్లో ప్రమాదాల నివారణ గురించి ఏర్పాటు చేసిన సిమెంట్ డివైడర్లకు కనీసం రేడియం స్టిక్కర్ వేయకపోవడం ,ప్రమాదాలు జరుగు ప్రదేశాల కంటే ముందు ఏర్పాటుచేసే జాగ్రత్తలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయకపోవడం వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయారు...బ్రిడ్జిపై మున్సిపల్ అధికారులు ఏర్పాటుచేసిన లైట్లు వెలుగుక పోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్ల వాహనదారులలో నియంత్రణ కోల్పోయి కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.







తక్షణమే పోలీసు అధికారులు , మున్సిపల్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు తగు చర్యలు తీసుకొని ఈ ఆర్ఓబి పై కొత్తపల్లి హనుమాన్ జంక్షన్ నుండి జమ్మికుంట బస్టాండ్ వరకు ఆర్ ఓ బి సెంటర్ నుంచి మోతుకుల గూడెం వరకు ప్రమాదరహితమైన హైవే పై ఏర్పాటు చేసే ఎరుపు రంగు స్టాపర్లను ఏర్పాటు చేయడమే కాకుండా బ్రిడ్జి సెంటర్లో సిగ్నలింగ్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహన దారులు, పట్టణ వాసులు కోరుతున్నారు . తక్షణమే జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్, ఆర్ అండ్ బి సూపర్డెంట్ ఇంజనీర్ ఈ బ్రిడ్జిని సందర్శించి ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడవలసిందిగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# మృతుడి భార్యకు గాయత్రి బ్యాంక్ చెక్కు అందజేత..



## - చెక్క అందజేసిన ఎమ్మెల్యే...

**కబురు న్యూస్, శంకరపట్నం మార్చి 11**
రోడ్డు ప్రమాదంలో మరణించిన కరీంనగర్ గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు కెన్నరసారం తిరుపతి సతీమణి వెంకటలక్ష్మికి లక్ష రూపాయల భీమా మొత్తాన్ని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. కేశవపట్నం గ్రామానికి చెందిన తిరుపతి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా, నామిని అయిన అతని భార్య వెంకటలక్ష్మికి ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి బ్యాంక్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ గొట్టె అశోక్, సీనియర్ ఆఫీసర్ వేముల విష్ణువర్ధన్, జూనియర్ ఆఫీసర్ ఉల్లంగుల అనిల్, బ్యాంకు అడ్వకేట్ కొరిమి ప్రవీణ్ కుమార్, కేశవపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోడిశాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

**కబురు న్యూస్, రామగిరి మార్చ్11.**
ఆర్జి-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో మంగళవారం జి.యం.కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ లతో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎం.రామచంద్రారెడ్డి,ఇతర సభ్యులు చర్చించారు.ఈ సమావేశంలో భాగంగా సెంటినరీ కాలనీలో గల క్వార్టర్స్ వెనుక భాగంలో శుభ్రపరచడం,జోన్-2 లో నీటి పైప్ లైన్ కొరకు తవ్విన గుంతలు పూడ్చి,నల్లా కనెక్షన్లు తిరిగి ఇవ్వడం,క్వార్టర్స్ కు సున్నం,రంగులు వేయించడం,వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్టీ-2 క్వార్టర్స్ పైభాగంలో మరమ్మతులు చేయించడం.అడ్రియాల లాంగ్ వాల్ గని ఉద్యోగులకు లాంగ్ బూట్లు ఇప్పించడం,లాకర్స్ సౌకర్యం కల్పించడం,అడ్రియాల లాంగ్ వాల్ గని లో క్యాప్ ల్యాంప్స్ విడిభాగాలను అందుబాటులో ఉంచడం,సబ్




స్టేషన్,ఫ్యాన్ హౌస్,ఫిల్టర్ బెడ్ లకు సెక్యూరిటి గార్డులను నియమించడం,ఓసిపి-2 లో గ్రేడర్స్,డోజర్స్ ను అందుబాటులో ఉంచడం,జి.యం కార్యాలయానికి వివిధ సేవల కోసం వస్తున్న విశ్రాంత ఉద్యోగుల కోసం విశ్రాంతి గది,మరుగు దొడ్లను నిర్మించడం,అడ్రియాల లాంగ్ వాల్ నుండి వకీల్ పల్లి గని రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించడం,వీధి దీపాలు ఏర్పాటు చేయడం,ఓసిపి-1,ఓసిపి-2 లో గత మూడు సంవత్సరాలకు సంబంధించి జనరల్ మజ్దూర్ (హెమ్),ఇ.పి. హెల్పర్,గ్రీజర్ పదోన్నతులు కల్పించడం,సెంటినరీ కాలనీలోని మార్కెట్ సెంటర్,తెలంగాణ సెంటర్ లలో బస్ షెల్టర్,మరుగుదొడ్లు నిర్మించడం లాంటి పది అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జి.యం.లు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జూపాక రాంచందర్,డి.తిరుపతి రావు,ఎస్.విజయ్ రాఘవ,భాస్కర రాజు, ఎస్వోటుజిఎం జి.రఘుపతి,ప్రాజెక్ట్ ఆఫీసర్లు సి.హెచ్.వెంకటరమణ,జె.రాజశేఖర్, విభాగాధిపతులు,అధికారులు కె.చంద్రశేఖర్, బి.సుదర్శనం,బి.రాజేంద్రకుమార్,యం.వి. ఎన్.ఎ.చంద్రశేఖర్,కె.వి.రామారావు,మతీన్ హుస్సేన్,పాల్గొన్నారు.

# రామగుండం నూతన సీపీ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన బిజేపి నేతలు..!



**కబురు న్యూస్, రామగుండం మార్చి 11:**
రామగుండం నూతన కమిషనర్గా పదవీ బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝా ని రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి కమిషనర్ కి పుష్పగుచ్ఛం అందించి,శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ....రామగుండం ప్రాంత అభివృద్ధికి, శాంతి భద్రతల పరిరక్షణకు సంపూర్ణ సహకారం అందిస్తామని, నగరంలో ప్రజాసమస్యల పరిష్కారంలో బీజేపీ పూర్తి సహకారం అందిస్తుందని కందుల సంధ్యారాణి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి,తోట కుమారస్వామి మరియు మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్ ,గుండబోయిన భూమయ్య,కోడూరి రమేష్,సిలువేరు అంజి పాల్గొని, కమిషనర్ కి శుభాకాంక్షలు తెలిపారు...



# పొలంబాటలో విద్యుత్ అధికారులు

## 100 కే.వి ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించిన ఎస్.ఈ,డీ.ఈ

**కబురు న్యూస్, రామగిరి మార్చ్11.**
రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో మంగళవారం ఎన్.పీ.డీ.సీ.ఎల్ విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా ఎస్.ఈ కె. మాధవరావు మంథని డివిజన్ డీ.ఈ వి.ప్రభాకర్ పొలంబాటలో పాల్గొని,రైతులతో ముచ్చటించారు.ఓవర్ లోడ్ తగ్గించడానికి ఈ ప్రాంతంలో నూతన వంద కే.వి ట్రాన్స్ఫార్మర్ ను ఎస్.ఈ,డి.ఈ లు కలిసి ప్రారంభించారు.విద్యుత్ సమస్యల పరిష్కారానికి,రైతులకు రక్షణ చర్యలను అధికారులు వివరించారు.ప్రతి రైతు తొందరపడి విద్యుత్ విషయంలో అజాగ్రత్తగా ఉండవద్దని వారు కోరారు.ముఖ్యంగా ఫ్యూజ్ పోయినప్పుడు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని,స్వతహాగా ఫ్యూజ్ వేసుకోవద్దని.సర్వీస్ వైర్ కు జాయింట్ ఉండవద్దని.నాణ్యతమైన కెపాసిటర్లు ఏర్పరచుకోవాలని.పీవీసీ బాక్స్ ఏర్పాటు చేసుకోవాలని.రైతులకు విద్యుత్ సమస్యలపై ఇబ్బందులు ఉంటే తమ ప్రాంతంలోని అధికారులకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ.డి.ఈ కనకయ్య,రామగిరి ఏ.ఈ కే.మహేందర్ రెడ్డి,సబ్ ఇంజనీర్ కే.సతీష్,సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్,లైన్ ఇన్స్పెక్టర్ ఏ నాగరాజు,లైన్ మెన్ లు ఏ శ్రీనివాస్,బి శివకుమార్, ఏ.ఎల్.ఎం లు రమేష్,ప్రభాకర్,అన్ మ్యాన్ లు జి చందు లక్ష్మణులు పాల్గొన్నారు.



# 15 నెలల్లోనే ప్రజల ముంగిట్లో సంక్షేమ పథకాలు.





## - పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**కబురు న్యూస్, పోత్కపల్లి మార్చ్11.**

15 నెలల్లోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వనపర్తి కాంగ్రెస్ ప్రభుత్వం నికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు చెప్పారు. పెద్దపల్లి జిల్లా కాల్వ(శ్రీరాంపూర్ మండలంలోని అంకంపల్లి ,కి పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి గ్రామాలలో సోమవారం సాయంత్రం నూతన ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి ముగ్గులు పోసి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు కిఅందుతున్నాయి అన్నారు. ఎన్ని సంక్షేమ పథకాలు ఈ దేశంలో ఎక్కడ కూడా లేవు అన్నారు. ప్రభుత్వం మన పెద్దపల్లి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఈ సంవత్సరం ఇవ్వడం జరిగింది అని అన్నారు. నాలుగేళ్ల కాలంలో 14 వేల ఇండ్లు మంజూరు అవుతాయి అని కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని అంకంపల్లె గ్రామాన్ని మరియు పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొని ఈ గ్రామాలకు రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాలు అందివ్వడం జరుగుతుంది అన్నారు. అందులో గ్రామంగా అంకంపల్లెకు 119 ఇండ్లు మంజూరైనాయి అన్నారు. దీంతోపాటు మరో పదిహేను రోజులలో నియోజకవర్గంలోని 128 గ్రామాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయి అన్నారు. గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఒక్క ఇల్లు కానీ ఒక్క రేషన్ కార్డు గాని ఇవ్వలేదు అన్నారు. ఇప్పటికి ప్రభుత్వం పది రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని కానీ ప్రతిపక్షాలు, ఓర్వలేని వారు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 21వేల కోట్లతో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసింది అన్నారు. ఈ నియోజకవర్గంలో చాలా మంది రైతులకు రుణమాఫీ జరిగిందని అసెంబ్లీలో నేను ప్రతిపక్షాలకు సవాల్ విసిరితే ఏ ఒక్కరు కూడా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సవాల్ స్వీకరించలేదన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఈ నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో క్వింటాలకు పది నుండి పన్నెండు కిలోల కటింగ్ పెట్టి రైతులను నిలువున ముంచారు అన్నారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గింజ కటింగ్ లేకుండా రైతులకు నియోజకవర్గంలో ఒక్క గింజ కటింగ్ లేకుండా వరి ధాన్యం నుంచి రైతులను ఆదుకోవడం జరిగింది చెప్పారు. రైతులకు సన్న వడ్లకు బోనస్ కూడా ఇవ్వడం జరుగుతుంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దేశంలో అధికారంలో ఉండగా రైతులకు ఎంతో మేలు చేసిందని, బిజెపి ప్రభుత్వం వచ్చిన రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారని, రైతుల సమస్యల గురించి ఢిల్లీలో అడుగుపెడితే ఈ బిజెపి ప్రభుత్వం ఇనుప కంచెలు వేసి అడ్డుకుందన్నారు. గౌరవ సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల సంక్షేమే లక్ష్యంగా పనిచేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల తో పాటు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఎండిన వరి పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి



## - రైతు సంఘం డిమాండ్

**కబురు న్యూస్, జఫర్ గడ్ మార్చ్11.**

జఫర్గఢ్ మండ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఎండీ. జాఫర్ అధ్యక్షతన జరిగినా సమావేశంలో మండల అధ్యక్షులు ఎండీ యాకుబ్ పాషా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముందు చూపు లేకపోవడం వలన దేవాదుల ప్రాజెక్టులను నీళ్లతో నింపకపోవడం వలన గ్రామాలలో చెరువులు కుంటలు నింపకపోవడం వలన బోర్లు బావులు అడగంటి పోయి రైతులు వేసిన వరి పంటలు మొత్తం ఎండిపోయిన పరిస్థితి ఉన్నది ఎకరకి 30నుండి 40వేలు రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు అందుకే రైతు సంఘంగా మేము డిమాండ్ చేస్తున్నాము. ఎకరాకు 50వేలు నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం అందించాలి జిల్లా ప్రభుత్వ యంత్రంగం అధికారులు ఎండిన వరి పంటలు పరిశీలించి సర్వే చేసి ప్రభుత్వానికి అందించి ఈ నెల 16 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి వస్తున్నారు ఈ లోపు ప్రభుత్వాధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి పంటలను సర్వే చేసి నష్ట పరిహారం అందించి మిగిలిన పంటలకు జిల్లాలో ఉన్న దేవాదుల ప్రాజెక్టు లను నీళ్లతో నింపి గ్రామాల చెరువులు కుంటాలను నింపి పంటలను రక్షించి రైతులను ఆదుకోవాలని లేని పక్షం లో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది రైతులు ఇబ్బంధులు పడుతుంటే రైతు సంఘం చూస్తూ ఊరుకోదని రైతులని సమీకరించి సంఘం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే నివేదించి ఉప్పుగల్లు రిజర్వాయర్ నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలం అయింది రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలుచేయలేదు రైతు భరోసా ఇయాసంగి పంటలు వేసి పంటలు చేతికి వస్తున్న ఇప్పటివరకు కేవలం 3ఎకరాలకు మాత్రమే రైతు భరోసా ఇచ్చారు మిగిలిన రైతులకు వేయనటువంటి పరిస్థి ఉందన్నారు మిగిలిన ఏఒక్క హామీ కూడా అమలు కావడం లేదన్నారు ఎప్పటికైనా రైతు లకి ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలనీ డిమాండ్ చేసారు ఈ సమావేశంలో రాడపక సత్తయ్య మంద బుచ్చయ్య రాములు సాయులు తదితరులు పాల్గొన్నారు.

# గరీబోల్ల కళలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

## - పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**కబురు న్యూస్,పోత్కపల్లి మార్చ్11.**

గరీబోల్ల కళలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పేర్కొ న్నారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ఆర్. కే గార్డెన్స్ లో మంగళవారం పలు గ్రామాలకు చెందిన 471 మంది లబ్ధిదారులకు రూ.కోటి ఇరవై ఏడు లక్షల డెబ్బై ఏడువేల ఐదు వందల రూపాయలు చెక్కులను, పెద్దపల్లి మండలం, పట్టణానికి చెందిన 86 మంది కల్యాణలక్ష్మి, షాది ముభారక్ రూ.86,60,034/- లక్షల రూపాయల విలువ గల చెక్కులను స్థానిక తహసీల్దార్, నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 15 నెలల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం 4,300 ఫైళ్లు ప్రభుత్వానికి పంపగా 6 కోట్ల 90 లక్షల 62 వేల రూపాయల విలువగల 2,590 చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. అలాగే నిమ్స్ లో ఉచిత వైద్యం కోసం 190 మందికి ఎల్ ఓ సి లు ఇప్పించినట్టు తెలిపారు. అలాగే పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ముగ్గురు ఆర్తో డాక్టర్లు పని చేస్తున్నారని తెలిపారు. గత పాలకుల హయంలో ఒక నెలలో 300 నుండి 400 వరకు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ఓపి 650 నుండి 800 వరకు, 60 నుండి 70 వరకు ఉన్న డెలవరీలు 200 వరకు పెరిగాయని అన్నారు. 50 పడకల ఆసుపత్రిని వంద పడకలకు అప్ గ్రేడ్ చేసుకున్నామని, నూతన భవనం నిర్మించిన తర్వాత ఇక్కడే ఎం.ఆర్.ఐ సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో కొత్తగా గుండె వ్యాధి డాక్టర్ ను నియమించినట్టు తెలిపారు. పేదలందరికీ ఫ్రీ వైద్యం అందించాలన్నదే మా లక్ష్యం అని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి, డబ్బు వృధా చేసుకోకుండా, జిల్లా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. అలాగే రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీతో మిత్తి కూడా మాఫీ కాలేదని ఎద్దేవ చేశారు. అలాగే సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లించామని, పెద్దపల్లి నియోజకవర్గంలో 59 కోట్ల 62 లక్షల రూపాయల బోనస్ డబ్బు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఆరు మండలాలలోని ఆరు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించామని తెలిపారు. రానున్న కాలంలో దశల వారీగా ఇంటి స్థలం ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప మరియు పలు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ డైరెక్టర్లు మరియు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసీ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జమ్మికుంట విచ్చేసిన సద్గురు స్వామి సమర్థ మహారాజ్





- సద్గురు దర్శనానికి బారులు తీరిన భక్తులు

**కబురు న్యూస్, జమ్మికుంట మార్చ్11.**



సద్గురు స్వామి సమర్థ మహారాజ్ జమ్మికుంట విచ్చేయగా సద్గురు దర్శనం కోసం తండోపదండాలుగా భక్తులు హాజరయ్యారు. సోమవారం రాత్రి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు సద్గురు వచ్చారు

సద్గురుకు శ్రీ సరస్వతి శిశు మందిర్, శ్రీ విద్యారణమాస విద్యాలయం విద్యార్థులు, భక్తులు కోలాటాల నడుమ శోభయాత్ర ను నిర్వహించి, ఘన స్వాగతాన్ని పలికారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలకగా సద్గురు స్వామీజీ భక్తులకు దర్శనం ఇచ్చారు .ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎర్రబాటి రామచంద్రరావు, బచ్చు తిరుపతి, జక్కోజు సతీష్ , ఇంగే శివాజీ ,ఆకుల రాజేందర్, పొలసాని సుధాకర్ రావు, గుడికందుల సుదర్శన్, సంపత్ రావు, రవీందర్ రెడ్డి, బోళ్ల సదానంద, దాసరి రవీందర్, హరికృష్ణ, యమసాని సమ్మయ్య రాజిరెడ్డి ,శివయ్య మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

**కబురు న్యూస్,జమ్మికుంట మార్చ్11.**




యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 250 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కెల్ విద్యార్థులకు ఉపయోగపడే పలు వస్తువులు మంగళవారం పంపించేశా రు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులగా విచ్చేసిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... చదువుతోనే బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవచ్చని విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని 10 వ తరగతి తోనే భవిష్యత్ కు తొలిమెట్టని అన్నారు. అదే విధంగా పదవ తరగతి లో 100% ఉత్తిర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ.. పదవ పరీక్షల్లో కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట మండలం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. అదే విధంగా 10/10 సాధించిన విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే విధంగా బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, జమ్మికుంట ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పట్టణకాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మోలుగురి సదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగే శ్రీకాంత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి రేణుకా, ఫిషరీష్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి రాకేష్ యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగారపు మహేష్, మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పంజాల అజయ్, చెన్నావేనా రమేష్, శనిగరపు తరుణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల అనిల్, దిడ్డి రాము, శ్రీహరి దొడ్డే నవీన్, ఏభూషి అజయ్, పాతకాల రమేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



# స్టార్ హీరోకు గాయం..

## ‘వార్2’ విడుదల వాయిదా పడనుందా!

కబురు సినిమా మార్చి11:
బాలీవుడ్ అగ్ర కథానాయకుడు హృతిక్ రోషన్ టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో స్పై థ్రిల్లర్‌గా ముస్తాబవుతోంది. ఈ సినిమా రిలీజ్ కోసం అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సినీ ప్రియులను కలవరపెడుతోంది.
పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఎన్టీఆర్ – హృతిక్‌ల మధ్య ఓ హుషారైన సాంగ్‌ను చిత్రీకరించాలని మేకర్స్ భావించారు. ఈ పాట రిహార్సల్స్ చేసే సమయంలో హృతిక్‌కు గాయాలైనట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆయన చికిత్స తీసుకుంటున్నారని వైద్యులు నెల రోజులు రెస్ట్ తీసుకోవాలని సూచించినట్లు బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.భారీ యాక్షన్ చిత్రంగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ ‘వార్ 2’ను నిర్మిస్తోంది. ప్రస్తుతం దీని షూటింగ్ ముగింపు దశలో ఉంది. ఈనేపథ్యంలో ముంబయిలోని యశ్‌రాజ్ స్టూడియోస్‌లో సిద్ధం చేసిన భారీ సెట్‌లో ఓ పాట షూట్ జరుగుతున్నట్లు కొన్నిరోజుల క్రితం వార్తలు వచ్చాయి. ఈ పాటలో ఇద్దరు హీరోలతో పాటు దాదాపు 500మంది డ్యాన్సర్లు పాల్గొంటున్నారని.. బాస్కో మార్టిన్ దీనికి కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారని టాక్ వినిపించింది. ఈ పాట చిత్రీకరణ సమయంలో హృతిక్ గాయపడినట్లు సమాచారం.

# కేతిక సర్‌ప్రైజ్



కబురు సినిమా మార్చి11:
కథానాయిక కేతికాశర్మ ప్రత్యేక గీతంతో సందడి చేయనుంది... ‘రాబిన్‌హుడ్’ సినిమాతో! అదిదా సర్‌ప్రైజ్... అంటూ తన అందచందాలతో ప్రేక్షకుల్ని మురిపించింది. ఆమె చేయనున్న సందడి ఎలా ఉంటుందో కొంచెం రుచి చూపిస్తూ, సోమవారం ఆ పాటని విడుదల చేసింది చిత్రబృందం. కొట్టిన లాటరీ ఎక్స్‌పయిరైతే... దాచిన నోట్లు రద్దయిపోతే... అంటూ సామాజిక మాధ్యమాల్ని ఊపేస్తున్న ఈ పాటని జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరచగా, చంద్రబోస్ రచించారు. నీతిమోహన్, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. శేఖర్ నృత్య దర్శకత్వం వహించారు. నితిన్, శ్రీలీల జంటగా రూపొందుతున్న చిత్రమిది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా పాటల్ని విడుదల చేస్తున్నారు. మూడో పాటగా ‘అది దా సర్‌ప్రైజ్’ పాటని విడుదల చేశారు. ఈ పాటలో కేతికాశర్మతోపాటు, నితిన్, శ్రీలీల జోడీ కూడా సందడి చేయనుంది.

# రంభ రీ ఎంట్రీ.. క్లారిటీ ఇచ్చిన నిర్మాత



కబురు సినిమా మార్చి11:
1990ల్లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించారు నటి రంభ . ఈ నటి మరోసారి వెండి తెరపై సందడి చేయనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా తమిళ నిర్మాత ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ వార్తలపై స్పందించారు. ఆమె రీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.ఇటీవల జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో తమిళ నిర్మాత కలైపులి ఎస్.థాను ఈ నటి రీ ఎంట్రీ గురించి మాట్లాడారు. “రంభ ఆర్థికంగా సెటిల్ అయ్యారు. తన భర్త కూడా పెద్ద వ్యాపారవేత్త. ఆయన ఇటీవల నన్ను కలిసినప్పుడు రంభకు మంచి సినిమాలో అవకాశం ఇవ్వమని కోరారు. అలాంటి ప్రాజెక్ట్ ఏమైనా ఉంటే కచ్చితంగా ఆమెను సంప్రదిస్తానని అతడికి హామీ ఇచ్చాను” అని చెప్పారు. దీంతో త్వరలోనే ఈ నటి రీ ఎంట్రీ ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.రాజేంద్ర ప్రసాద్ హీరోగా నటించిన ‘ఆ ఒక్కటి అడక్కు’ సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపుతెచ్చుకున్నారు రంభ. ఆ తర్వాత వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు సొంతం చేసుకున్నారు. అంతేకాదు.. దేశముదురు, యమదొంగ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో అదరగొట్టారు. ఈ పాటలు ఇప్పటికీ ట్రెండింగ్‌లో ఉన్నాయి. 2010లో కెనడాలో స్థిరపడిన ఇంద్రకుమార్‌ను వివాహం చేసుకున్నారు. దీంతో కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. నటనకు దూరంగా ఉంటున్నప్పటికీ పలు టీవీ డ్యాన్స్ షోలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. చివరిసారి 2008లో వెండితెరపై కనిపించారు రంభ.

# 2014-23 ఉత్తమ చిత్రాలకు గద్దర్ అవార్డ్స్.. విధి విధానాలు ఖరారు



కబురు సినిమా మార్చి11:
తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 2014 నుంచి 2023 వరకూ ఒక్కో ఏడాదికి ఉత్తమ చలన చిత్రానికి అవార్డు ఇవ్వాలని నిర్ణయించింది. అవార్డులకు సంబంధించిన విధి విధానాలను తాజాగా ఖరారు చేసింది. మార్చి 13వ తేదీ నుంచి అవార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనుంది.నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు, ఫీచర్ ఫిల్మ్, జాతీయ సమైక్యత చిత్రం, బాలల చలనచిత్రం విభాగం, పర్యావరణం, హెరిటేజ్, చరిత్రపై తీసే చిత్రాలకు పురస్కారాలు అందజేయనున్నారు. తొలి ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిల్మ్, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ ఫిల్మ్, షార్ట్ ఫిల్మ్ విభాగాల్లోనూ ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకూ ఈ అవార్డును ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పైడి జయరాజ్, కాంతారావు, ఎం.ప్రభాకర్‌రెడ్డి పేర్లతో అవార్డులు కొనసాగించాలని నిర్ణయించింది.

# నేను ఒక్కడినే హీరోని కాదు




కబురు సినిమా మార్చి11:
ఓవైపు వినోదభరిత పాత్రలతో అలరిస్తూనే.. మరోవైపు ‘మల్లేశం’, ‘బలగం’ లాంటి విజయవంతమైన చిత్రాలతో హీరోగానూ సత్తా చాటారు ప్రియదర్శి. ఇప్పుడాయన ప్రధాన పాత్రలో హీరో నాని స్వయంగా నిర్మించిన చిత్రం ‘కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ’ . రామ్ జగదీశ్ దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు ప్రియదర్శి. ఆ విశేషాలివి..“ఈ సినిమా ఓ సగం ప్రేమకథతో.. మరో సగం కోర్టు రూమ్ డ్రామాతో సాగుతుంది. దీంట్లో ప్రధానంగా పోక్సో యాక్ట్‌పై చర్చించాం. గతంలో కొన్ని పోక్సో కేసుల్లో న్యాయస్థానాలు ఇచ్చిన జడ్జిమెంట్‌లను ఆధారం చేసుకుని.. ఆ కేసుల పూర్వాపరాలపై ఎంతో పరిశోధన చేసి దర్శకుడు జగదీశ్ ఈ కథను పగడ్బందీగా సిద్ధం చేశాడు. నేనిందులో సూర్యతేజ అనే న్యాయవాదిగా కనిపిస్తా. ఈ పాత్ర కోసం నేను తెర వెనుక చాలా వర్క్ చేశా. దర్శకుడిచ్చిన జడ్జిమెంట్ కాపీలన్నీ చదవడంతో పాటు నేరుగా కోర్టులకు వెళ్లి అక్కడి వాతావరణం ఎలా ఉంటుంది... న్యాయవాదులు కేసులు ఎలా వాదిస్తుంటారు.. ఎలాంటి పరిభాష వాడుతుంటారు.. న్యాయమూర్తులతో ఎలా వ్యవహరిస్తుంటారు.. అన్నీ స్వయంగా తెలుసుకున్నా. ఐదారేళ్ల పిల్లలపై జరుగుతున్న ఆ అఘాయిత్యాలు గురించి విన్నప్పుడు హృదయవిదారకంగా అనిపించింది. మనసుని తీవ్రంగా కలచివేసింది”. “స్టేట్ ఆఫ్ తమిళనాడు వర్సెస్ రాధాకృష్ణ కేసు ఈ చిత్ర కథకు స్ఫూర్తి. ఈ చిత్రంతో మేము ఏమీ సందేశాలు ఇవ్వట్లేదు. అలాగే న్యాయవ్యవస్థ గురించి పాఠాలు చెప్పట్లేదు. పోక్సో చట్టమేంటి? దాన్ని ఎందుకు పెడతారు? ఓ అమాయక కుర్రాడు ఆ కేసులో ఇరుక్కుంటే న్యాయవ్యవస్థ తనని ఎలా కాపాడింది? అన్నది మాత్రమే చూపించనున్నాం. ఈ చిత్రాన్ని వీలైనంత రియలిస్టిక్‌గా చూపించే ప్రయత్నమే చేశాం. ఈ సినిమాకి నేనే హీరో అని అనుకోవట్లేదు. దీంట్లోని ప్రతి పాత్ర హీరోనే. ఏ ఒక్క పాత్ర లేకున్నా ఈ సినిమా వర్కవుట్ అవ్వదు”.“నేనేమీ గొప్ప స్టార్‌ను కాదు. నా పోస్టర్ పడగానే టికెట్లు తెగేంత సీనేం లేదు. నేను మంచి సినిమా చేస్తేనే అందరూ చూస్తారు. లేకపోతే ఎవరూ థియేటర్లకు రారు, చూడరని ‘డార్లింగ్’తోనే తెలిసిపోయింది. కాబట్టి నావంతుగా మళ్లీ ఫెయిలవ్వకుండా బలమైన కథలతో మంచి సినిమాలు చేయాలి. అలా నేను చేసిన ఓ మంచి సినిమాకి పెట్టిన డబ్బులు కన్నా రెట్టింపు వసూళ్లు దక్కాయంటే.. నేను కమర్షియల్ హీరో అన్నట్లే లెక్క. అప్పుడే నేను హీరోగా మరో సినిమా చేయగలుగుతా. ‘కమర్షియల్ హీరో’ అనే పదానికి నా దగ్గరున్న నిర్వచనమిదే. ‘మల్లేశం’, ‘బలగం’ ఇలాంటివన్నీ నన్ను వెతుక్కుంటూ వచ్చిన కథలు. ఇలాంటి కథలు చేసినప్పుడే నా సినిమాలకు వసూళ్లు వస్తాయని అర్థమైంది. ‘మంగళవారం’లో ఓ కమర్షియల్ హీరోలా అన్ని స్టంట్లు చేశా. దాన్ని ఎంజాయ్ చేశా. కాకపోతే దాని పరిధి అంతమేరకు ఉంటేనే బాగుంటుంది. నేను అంతకు మించి ఏమాత్రం చేసినా ప్రేక్షకులు ఇక చాల్లే అనుకుంటారని తెలుసు”.“నాకు శాంత బయోటిక్ వ్యవస్థాపకుడు కె.ఐ.వరప్రసాద్ రెడ్డి బయోపిక్ చేయాలని ఉంది. చాలా ఎక్కువ ఖర్చయ్యే ఎన్నో మెడిసెన్స్‌ని చౌక ధరల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన రియల్ హీరో ఆయన. అందుకే ఆయన జీవితకథ తెరపైకి తీసుకురావాలని ఉంది. ఆ మధ్య బ్రహ్మానందం తనయుడి పెళ్లిలో ఆయన్ని కలిసినప్పుడు తన దగ్గర బయోపిక్ విషయాన్ని ప్రస్తావించా. ఆ మాట విని తను నవ్వుతూ వెళ్లిపోయారు. ఈసారి మళ్లీ కలిసినప్పుడు ఆయన్ని ఎలాగైనా ఒప్పిస్తా”.

# భారతీయ తొలి ఏఐ సినిమా

కబురు సినిమా మార్చి11:
‘డ్రైవింగ్ చేస్తాను, స్టాండప్ కామెడీ చేస్తాను, అలాగే ర్యాప్ కూడా చేస్తాను.. కానీ ఇన్‌స్టాగ్రాంలో నన్నేమంటారో తెలుసా” అంటూ తొలి భారతీయ ‘ఏఐ’ సినిమా ‘నైషా’ను పరిచయం చేసింది చిత్రబృందం. ఇందులో ఏఐ సృష్టించిన నైషా బోస్, జైన్ కపూర్ ప్రధాన పాత్రధారులు. భారతీయ సినీ చరిత్రలో ‘నైషా’ ఓ మైలురాయి. ప్రేమకథా నేపథ్యంలో ఈ చిత్రాన్ని వివేక్ అంచలియా రూపొందిస్తున్నారు. పోరి భుయాన్, శ్వేతా శర్మ అంచలియా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం.‘నేను అతణ్ని ప్రేమిస్తున్నాను, ఏమంటున్నావే.. నువ్వు అతన్ని కలిసింది గత వారమే, ఆయన్ను చూసినప్పటి నుంచి నా బ్రెయిన్ పనిచేయట్లేదు, మన ప్రేమను ప్రకృతితో చెప్పనివ్వు, నేను జీవితంలో ప్రతిదీ చేయాలనుకుంటాను, కానీ అది ఒక వ్యక్తితో ఆగదు, మొదటి నుంచి చెప్తూనే ఉన్నాను.. నేను ప్రేమలో పడనని, మన దగ్గర ఉన్నవారితో సమయం ఎందుకు గడపలేకపోతున్నాం? ప్రేమించిన వ్యక్తిని అంత తేలికగా మర్చిపోతారా?..” అనే సంభాషణలతో ఆసక్తికరంగా సాగుతోంది ట్రైలర్. దేశంలోనే మొదటి ఏఐ ఆధారితంగా రూపొందిన ఈ సినిమాలోని పాత్రలు, దృశ్యాలు సినీ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి ప్రేమించిన వ్యక్తికి దూరమైతున్నానా! అని బాధపడుతున్న నైషా పాత్ర ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటోంది. ఈ సినిమా ఈ ఏడాది మేలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com